క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బలభద్రపురంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

బిక్కవోలు: వాతావరణం దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. బలభద్రపురంలోని సచివాలయం - 3 వద్ద సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు జరిపారు. వారిలో 12 మందికి సాధారణ జ్వరం ఉన్నట్టు గుర్తించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ మార్పులతో జ్వరం, దగ్గు, వాంతులు, నీరసంగా ఉంటుందన్నారు. రెండు రోజులు మించి ఈ లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలోని సర్పంచ్ బుంగా రామారావు, గణేష్ పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మైలవరపు కష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు సత్యం రమేష్‌బాబు, రాయుడు శ్రీనివాస్ తదితరులు 262 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్తం, నీరుడు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కంటి శిబిరంలో 47 మందికి పరీక్షలు నిర్వహించి, వారిలో 11 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, గద్దె సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారన్నారు. పాము, కుక్కకాటు నివారణ మందులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. అధిక వర్షాల వలన ప్రజలకు వైరల్ జ్వరాలు, జలుబు, డెంగీ, టైఫాయిడ్, మలేరియా, నీళ్ల విరేచనాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచి చాల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలన్నారు.

గంజాయి కోసం బైక్‌ల దొంగతనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

కంబాలచెరువు: గంజాయిని కొనుగోలు చేసేందుకు బైకులను దొంగతనం చేస్తున్న ఆరుగురిని రాజమహేంద్రవరం ఒకటో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 20 కేజీల గంజాయి, దొంగిలించిన పది మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సుబ్బారావు నగర్‌కు చెందిన తెలంసాయి భార్గవ్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన నేతల వివేక్, రెల్లిపేటకు చెందిన రాయి సింహాద్రి, తాడితోటకు చెందిన దాసరి చందు, వీరభద్రనగర్‌కు చెందిన సోరా దుర్గ గంజాయి విక్రయాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో గంజాయిని కొనుగోలు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. దానికి కావాల్సిన డబ్బుల కోసం ద్విచక్ర వాహనాలను దొంగతనం చేయడం ప్రారంభించారు. ఇలా పది మోటారు సైకిళ్లు దొంగతనం చేసి, వాటిని అమ్మకం ద్వారా వచ్చిన సొమ్ముతో గంజాయి కొనుగోలు చేశారు. జాంపేట సమీపంలోని ముగ్గుపేట వద్ద గంజాయితో వీరు ఉండగా వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మురళీకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ జె.ఆదినారాయణ తమ సిబ్బందితో ఆ ప్రాంతంలో దాడి చేశారు. నిందితులను పట్టుకుని, వారి నుంచి ఒక కారు, పది మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



అనపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రామవరంలో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు



పందలపాకలో వైఎస్సార్ వర్ధంతిలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

మహానేతకు నీరాజనం

- వాడవాడలా వైఎస్సార్‌కు నివాళి
- సేవలను స్మరించుకున్న ప్రముఖులు
- విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పాంజలి



రాజానగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

మధురపూడి: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. పేదల సంక్షేమానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కోరుకొండ మండలం కాపవరంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా నిలిచిన వైఎస్సార్.. సంక్షేమ సారథిగా ఎందరి జీవితాలనో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, 108 వంటి వాటిని ఎంతో సమర్థంగా నిర్వహించారన్నారు. ఆయన ఆశయాల మేరకు పనిచేస్తామని, వారు చూపిన బాటలోనే నడుస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

▸▸ వైఎస్సార్ పాదయాత్ర సమయంలో బూరుగుపూడిలో కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కోరుకొండ, మధురపూడి, గుమ్ములూరు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

దోసకాయలపల్లిలో ఉద్రిక్తత

దోసకాయలపల్లి దేవీగుడి సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహం ఉంది. దానికి వెళ్లే దారికి అడ్డంగా జనసేన నాయకులు పవన్ కల్యాణ్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విగ్రహం వద్దకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. దీనిపై జెడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీని తొలగించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కడవల శివ, పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ గొల్లవిల్లి మురళి, గడమాల అప్పారావు, కోన అబ్బు, కర్రి వెంకటేశ్వరరావు, మార్ని సత్తిబాబు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు

రాజానగరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజానగరంలోని వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు వాద్రేవు శ్రీనివాసరావు, కొల్లి వీర్రాజు, ఆకుల శ్రీను, సర్పంచ్ కుందేటి ప్రసాద్, సంగీత ప్రసాద్, వివి రమణ, పి. శ్రీను పాల్గొన్నారు.



బూరుగుపూడిలో వైఎస్సార్ వర్ధంతిలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

▸▸ శ్రీకృష్ణపట్నంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, ఎం.వీర్రాజు, రాధేయపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, ముక్కినాడలో మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు అనదాస సాయిరామ్, కొత్త తుంగపాడులో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, సంపత్ నగరంలో సర్పంచ్ పి.రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లంక అమ్మిరాజు, ఆదినారాయణ, నరేంద్రపురంలో పబ్బన శ్రీనివాస్, నందరాడలో జిలానీ, చినభద్రం, చల్లయ్య, కొత్తవెలుగుబందలో కూటి ప్రసాద్, తూర్పుగానుగూడెంలో చల్లా వెంకట్, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

పెదపూడి: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండె చప్పుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కొనియాడారు. జి.మామిడాడలోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్సార్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పార్టీ నేత చింతా దొరబాబు, అతడి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ కేతా తులసి, సర్పంచి లంక మున్ని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గుడిమెట్ల మురళీ కృష్ణారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, మండల బూత్ కన్వీనర్ సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకుడు సాంబత్తుల చంటి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, ద్వారంపూడి వెంకటరెడ్డి, చింతదొరబాబు పాల్గొన్నారు. పెదపూడిలో ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, మార్ని కామరాజు చౌదరి, కాకర చందు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక నాయకులు పుష్పాంజలి ఘటించారు.



సీతానగరంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

▸▸ పేదల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిరంతరం శ్రమించారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి కెనాల్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీ మోహన్ బాలకృష్ణారెడ్డి, సత్తి వెంకటరామారెడ్డి, గుంటూరు శ్రీను, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, బండారు శ్రీనువాసు, ఏడుకొండలు పాల్గొన్నారు.

▸▸ పేదల పెన్నిధి వైఎస్సార్ అని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంటకరెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ నాయకులు కర్రి రామచంద్రారెడ్డి, లంక ప్రసాద్, లంక శ్రీను, మంతిన అప్పారావు, టేకీ రాఘవ కొవ్వూరి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఆయన విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పాంజలి ఘటించారు. బిక్కవోలు, బలభద్రపురంలోని విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఊలపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ బండారు శివ, పందలపాకలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకట రమణ, కొంకుదురులో సర్పంచ్ సత్తి వీరమణి, జెడ్పీసీటీ రొంగల పద్మావతి, ఎంపీటీసీ కొంకుదురు పీపీ, రంగాపురంలో సర్పంచి గండికోట వీరభద్రరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఇలపల్లి, ఆర్‌ఎస్‌పేట, బలభద్రపురం, ఆరికరేవుల, కొమరిపాలెం మోళ్లూరు గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు.



సుభద్రంపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

సంక్షేమ రారాజుకు నివాళి

రంగంపేట: సంక్షేమ రారాజు వైఎస్సార్ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈలకొలనులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగంపేట, వడిశలేరు, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొంతమూరు, వీరంపాలెం, ముకుందవరం, సుభద్రంపేట, వెంకటాపురం, ఎస్టీరాజాపురం, దొడ్డిగుంట తదితర గ్రామాల్లో నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పాలాటి నాగేశ్వరరావు, కొల్లాటి ఇజ్రాయేలు, పోతుల బులివీర్రాజు, అడబాల వెంకటేశ్వరరావు, మాచిన గోవిందరాజు, జాస్తి సత్తిబాబు, గవరసాని రాజు, వేము చిరంజీవి, నల్లా దుర్గాప్రసాద్, చెక్కపల్లి నాని, గండి వెంకటేశ్వరరావు, నాగులపల్లి రామచంద్రరావు, మాగాపు వెంకటరమణ, అద్దాల వెంకటేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

పేదల సంక్షేమానికి అనేక పథకాలు



మిర్తిపాడులో వైఎస్సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మిర్తిపాడు అంబేడ్కర్ కాలనీలో జైభీమ్‌యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మహానేత చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలమన్నారు. జై భీమ్ యూత్ సర్కిల్ నిర్వహించిన అన్నదానాన్ని జక్కంపూడి గణేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంటీటీసీ మాకిరెడి దేవి ప్రారంభించారు.

= సీతానగరం మదర్ థెరిసా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతిలో మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మాజీ ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, వలవల సత్తిబాబు, మట్ట వసంతరావు పాల్గొన్నారు. నాగంపల్లిలో మన్నెల్లి వెంకట్రావు, చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండురాజు, పోలినాటి ఈశ్వరుడు, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు పాల్గొన్నారు.

చినకొండేపూడిలో రోడ్డుకు మరమ్మతులు



గోతులను పూడ్చుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: చినకొండేపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి చీపురుపల్లి రోడ్డులోని లక్ష్మీదేవి ఆలయం వరకూ రోడ్డుపై విపరీతంగా గోతులు పడ్డాయి. ఆ రోడ్డులో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆ గోతులను పూడ్చించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా గోతులలో క్వారి వెట్ మిక్స్ వేసి మరమ్మతులు చేయించారు. దీనిపై పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, పోలినాటి ఈశ్వరుడు, ముదునూరి రామకృష్ణంరాజు, కోనే శ్రీనివాస్ (ఇంద్ర), యర్రంశెట్టి బాబులు, బొచ్చు మురార్జీ, లక్కిశెట్టి శివ, మేడిశెట్టి చిన్నికృష్ణ, ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు

నేత్రదానంపై సదస్సు

మధురపూడి: నేత్రదానం చేయడం వల్ల మరొకరికి చూపు ప్రసాదించిన వారవుతారని నేత్ర వైద్యుడు సీహెచ్ ఆనందరావు అన్నారు. కోరుకొండ పీహెచ్‌సీలో డాక్టర్ పి.జ్ఞానచంద్ర ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకూ జరిగే 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు.

గౌరవ వేతనాల కోసం బీఎల్‌ఓల ఎదురుచూపు

రాజానగరం: ఓటరు జాబితాలను తయారు చేయడంలో బూత్ లెవెల్ ఆఫీసర్లది (బీఎల్‌ఓలు) కీలక పాత్ర. ఇంటింటికీ తిరిగి కొత్త ఓటర్లను నమోదు చేయడతో పాటు వివిధ రకాల సవరణలకు సంబంధించిన ప్రక్రియను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. ఇందుకు గౌరవ వేతనంగా కొంత మొత్తం చెల్లించడం పరిపాటి. అయితే రాజానగరం నియోజకవర్గంలో ఎందుకనో సార్వత్రిక ఎన్నికలు పూర్తయి నాలుగు మాసాలు కావొస్తున్నా ఇంత వరకూ వారికి గౌరవ వేతనాలు అందలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నియోజకవర్గంలో ఇచ్చారు, ఆ నియోకవర్గంలో ఇచ్చారు .. అనే ప్రచారాలు జరుగుతున్నాగానీ ఏ నియోజకవర్గంలోను బీఎల్‌ఓలకు గౌరవ భృతులు ఇంతవరకు ఇవ్వలేదని సంబంధిత అధికారులు అంటున్నారు.

250 మంది సేవలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి స్పెషల్ సమ్మర్ రివిజన్ క్యాంప్‌ల పేరుతో నిర్వహించిన కొత్త ఓటర్ల నమోదు, ఇతర సవరణల ప్రక్రియలకు బీఎల్‌ఓలుగా వీఆర్వోలు, మహిళా పోలీసులు, గ్రేడ్ 3, 4, 5 పంచాయతీ కార్యదర్శులు మున్నగు వారు రాజానగరం నియోజకవర్గంలో 250 వరకు తమ సేవలను అందించారు. ఇందుకుగాను వారికి రూ. 3.75 లక్షలు వరకు గౌరవ వేతనాలుగా చెల్లించాల్సి ఉంది. కొన్ని నియోజకవర్గాలలో ఒక్కొక్కరికీ రూ. 1500 గౌరవ వేతనంగా చెల్లించారని అంటున్నారు. అంతేకాక రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఉన్న చైత్రవర్షిణి తన పర్సనల్ అసిస్టెంట్లుగా నియమించుకున్న వారికి ఒక్కొకరికీ రూ. 3 వేలు చెల్లించారు. కానీ బీఎల్‌ఓల గౌరవ వేతనాలను విస్మరించారు. వీటి గురించి గట్టిగా అడగటానికి లేదు, ఆందోళన చేస్తామంటే సస్పెండ్ చేస్తామని, షోకాజ్ నోటీసులిస్తామని బెదిరిస్తున్నారని బీఎల్‌ఓలుగా విధులు నిర్వర్తించిన చిరుద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే ఆర్డీఓ, తహసీల్దార్, ఎలక్షన్ డీటీలకు వినతి పత్రాలు అందజేశారు. అయితే మీకంటూ ప్రత్యేకంగా నిధులు మంజూరు కాలేదు, వచ్చిన తరువాత ఇస్తామంటూ ఆయా అధికారులు సమాధానాలు చెబుతున్నారు. ఈ విషయమై రాజమండ్రి ఆర్డీఓ లక్ష్మీశివజ్యోతిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు



రైల్వే స్టేషన్‌లో రైళ్ల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు కావడంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జన్మభూమి, రత్నాచల్, గౌతమి, గోదావరి, విశాఖ, గరీబ్ రథ్, విశాఖపట్నం -మహబూబ్ నగర్, ఎల్టీటీ లోకమాన్య తిలక్, వందేభారత్, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను సోమవారం రద్దు చేశారు. అలాగే రద్దు కాని రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. వాటిని ఎక్కేందుకు ప్రయాణికులు నిరీక్షించారు. అలాగే రైల్వే స్టేషన్ మెయిన్ గేటు వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కొనసాగుతోంది. రైళ్ల రాకపోకలను తెలుసుకునేందుకు 0883 2420541 నంబర్‌కు ప్రయాణికులు సంప్రదించాలని సీటీఐ సుంకర చంద్రమౌళి కోరారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని పలు గ్రామాల్లో మట్టి గణపతి విగ్రహాలు పంపీణీ చేశారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు.

రాజానగరం: పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని జనసేన పార్టీ కార్యకర్తల సహకారంతో స్థానిక కొత్తకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తరగతి గదిని డిజిటల్ క్లాస్ రూమ్‌గా ఆధునీకరించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూపాదేవి, చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేష్ సోమవారం దీన్ని ప్రారంభించారు.

పెదపూడి: పెద్దాడ గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు. రక్తదానం చేసిన వారికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. పెదపూడిలో జనసేన, టీడీపీ నాయకులు స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.

త్రిముఖ లింగేశ్వరస్వామికి బూరెల అభిషేకం



స్వామికి బూరెలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామికి మాస శివరాత్రి పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆరువేల బూరెలతో అభిషేకం చేశారు. అర్చకులు రమణశర్మ, భాస్కర శర్మ మాట్లాడుతూ శివునికి బూరెలతో అభిషేకం చేస్తే సకాల వర్షాలు కురిసి, పాడి పంటలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం బూరెలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.